# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 13-07-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్వేరు రంగాలకు చెందిన నలుగురు ప్రముఖులను రాజ్యసభకు నామినేట్ చేశారు.
- ❖ "ఆపరేషన్ సిందూర్" అనంతరం విదేశాల్లో బ్రహ్మోస్ క్షిపణులకు డిమాండ్ పెరిగిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.
- ❖ నకిలీ, నాసిరకం ఎరువుల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్రం రాష్ట్రాలకు స్పష్టం చేసింది.
- ❖ ప్రయాణీకుల భద్రత దృష్ట్యా అన్ని రైలు బోగీలలో సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్ ఆదేశించారు.
- ❖ భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య మూడవ టెస్ట్ మ్యాచ్ లో రెండవ ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ టీ విరామ సమయానికి 6 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసింది.

=====================

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్వేరు రంగాలకు చెందిన నలుగురు ప్రముఖులను రాజ్యసభకు నామినేట్ చేశారు. కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఒక నోటిఫికేషన్‌లో ఈ విషయాన్ని వెల్లడించింది. ప్రముఖ న్యాయవాది ఉజ్వల్ దేవ్‌రావు నికం, సామాజిక కార్యకర్త సి.సదానందన్ మాస్టర్, మాజీ విదేశాంగ కార్యదర్శి హర్ష్ వర్ధన్ శ్రింగ్లా, చరిత్రకారుడు డాక్టర్ మీనాక్షి జైన్‌లు నామినేట్ అయిన జాబితాలో చోటు దక్కించుకున్నారు. వారికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు.

=====================

"ఆపరేషన్ సిందూర్" అనంతరం విదేశాల్లో బ్రహ్మోస్ క్షిపణులకు డిమాండ్ పెరిగిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఉత్తరప్రదేశ్ లక్నోలో ని నేషనల్ పీజీ కళాశాలలో ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి చంద్రభాను గుప్తా విగ్రహాన్ని కేంద్రమంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.... ఆపరేషన్ సిందూర్

సమయంలో బ్రహ్మోస్ క్షిపణులు అద్భుతంగా పని చేశాయని, 14 దేశాలు ఈ క్షిపణుల కోసం భారత్ ను సంప్రదించాయని వెల్లడించారు. బ్రహ్మోస్ క్షిపణులను లక్నో నుండి కూడా ఎగుమతి చేస్తామని, ఇది ఆ రాష్ట్రంలో ఉపాధిని పెంచడంలో దోహదపడుతుందని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొంటూ…

(వాయిస్ 24 సెకన్లు)

=====================

ప్రయాణీకుల భద్రతను పెంచడానికి అన్ని బోగీలలో సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని రైల్వే శాఖ నిర్ణయించింది. లోకో మోటివ్‌లు, కోచ్‌లలో సీసీ టీవీ కెమెరాల ఏర్పాటు పురోగతిపై రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, సహాయ మంత్రి రవ్నీత్ సింగ్ బిట్టు ఈ రోజు సమీక్ష చేపట్టారు. 74 వేల రైలు బోగీలు, 15 వేల లోకోమోటివ్స్‌లో సీసీ టీవీ కెమెరాల ఏర్పాటుకు అశ్విని వైష్ణవ్ ఆమోదం తెలిపారు. ప్రతి రైలు బోగీలో నాలుగు డోమ్ రకం సీసీ టీవీ కెమెరాలు, ప్రతి లోకోమోటివ్‌లో ఆరు సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. గంటకు 100 కిలోమీటర్ల వేగంతో రైలు ప్రయాణిస్తున్నపుడు, తక్కువ వెలుతురు ఉన్న పరిస్థితులలో కూడా అధిక నాణ్యత గల ఫుటేజ్ అందుబాటులో ఉండేలా చూసుకోవాలని రైల్వే అధికారులకు మంత్రి అశ్విని వైష్ణవ్ సూచించారు.

=====================

నకిలీ, నాసిరకం ఎరువుల సమస్యపై తక్షణం కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులకు ఒక లేఖ రాశారు. దేశవ్యాప్తంగా నకిలీ ఎరువుల విక్రయాలు, రాయితీ ఎరువులు బ్లాక్‌మార్కెట్ కు తరలిపోవడం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలు తమ దృష్టికి వచ్చాయని, వీటిని అరికట్టాలనే లక్ష్యంతోనే ఈ లేఖను జారీ చేశామన్నారు. వ్యవసాయం భారతదేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని, రైతులకు స్థిరమైన ఆదాయం కల్పించడానికి వారికి సరైన సమయంలో, సరసమైన ధరలకు నాణ్యమైన ఎరువులను అందించడం చాలా అవసరమని శివరాజ్ సింగ్ ఆ లేఖలో పేర్కొన్నారు.

=====================

సింగపూర్ పర్యటనలో ఉన్న భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ ఈరోజు సింగపూర్ విదేశాంగ మంత్రి వివియన్ బాలకృష్ణన్‌ను కలిశారు. అనంతరం టెమాసెక్ హోల్డింగ్స్ సంస్థ ప్రతినిధి టియో చీ హీన్‌ను కూడా కలిసి భారతదేశంలో పెట్టుబడి అవకాశాల గురించి చర్చించారు. సింగపూర్ పర్యటన తర్వాత, విదేశాంగ మంత్రి షాంఘై సహకార సంస్థ (ఎస్సీఓ) విదేశాంగ మంత్రుల సమావేశంలో పాల్గొనడానికి చైనాలోని టియాంజిన్ చేరుకుంటారు. ఈ సందర్భంగా ఆయన పలు దేశాలతో ద్వైపాక్షిక సమావేశాలను నిర్వహించనున్నారు.

=====================

కార్గిల్ విజయ్ దివస్ 26వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని భారత సైన్యం ఈ రోజు లడఖ్‌లో కుంభతంగ్ నుండి రంధవా టాప్ వరకు సంస్మరణ బైక్ ర్యాలీని నిర్వహించింది. 1999లో సైన్యం చేపట్టిన ఆపరేషన్ విజయ్ లో ప్రాణాలు అర్పించిన సైనికులకు హృదయపూర్వక నివాళిగా నిలిచిన ఈ ర్యాలీలో మొత్తం 50 మంది రైడర్లు పాల్గొన్నారు.

విరామం

=====================

భారత వ్యోమగామి, గ్రూప్ కెప్టెన్ శుభాంషు శుక్లా ఆక్సియం-4 మిషన్‌లోని మరో ముగ్గురు సిబ్బంది రేపు భూమికి తిరిగి తమ ప్రయాణాన్ని ప్రారంభించే అవకాశం ఉంది. భారత కాలమానం ప్రకారం రేపు సాయంత్రం 4 గంటల 30

నిమిషాలకు అన్ డాకింగ్ అయ్యి మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు భూమికి చేరుకుంటారని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖా మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ సామాజిక మాధ్యమ ఎక్స్ వేదికగా తెలిపారు. ఇక లక్నోలో గ్రూప్ కెప్టెన్ శుభాంషు శుక్లా తండ్రి శంభు దయాల్ పాత్రికేయులతో మాట్లాడుతూ...

(వాయిస్ 15 సెకన్లు)

=====================

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రేపటి నుండి రెండు రోజుల పాటు ఒడిశాలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా భువనేశ్వర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (AIIMS) ఐదవ స్నాతకోత్సవంలో పాల్గొంటారు. అనంతరం రావెన్‌షా విశ్వవిద్యాలయం 13వ వార్షిక స్నాతకోత్సవానికి హాజరవుతారు. అలాగే కటక్‌లోని రావెన్‌షా బాలికల ఉన్నత పాఠశాల భవనానికి శంకుస్థాపన చేయనున్నారు.

=====================

ప్రతిష్టాత్మకమైన టెన్జింగ్ నార్గే నేషనల్ అడ్వెంచర్ అవార్డు (TNNAA) 2024 కోసం కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ నామినేషన్లను స్వీకరిస్తున్నట్లు ప్రకటించింది. సాహసయాత్రలో అత్యుత్తమ విజయాలను సాధించిన వారికి ఈ అవార్డులను ప్రధానం చేస్తారు. అర్జున అవార్డులతో పాటు ప్రతి సంవత్సరం ప్రదానం చేసే టెన్జింగ్ నార్గే నేషనల్ అడ్వెంచర్ అవార్డు ను నాలుగు విభాగాల్లో అందిస్తారు. అవార్డు గ్రహీతలకు కాంస్య విగ్రహంతో పాటు ధృవపత్రం, 15 లక్షల రూపాయల నగదును బహుమతిగా అందిస్తారు. కాగా ఈనెల 15వ తేదీ వరకు ధరఖాస్తులను పంపించవచ్చు.

=====================

ఆగ్నేయాసియా దేశాల సంఘం - ASEAN ఐక్యతకు, కేంద్రీకరణకు భారతదేశం దృఢమైన మద్దతు ఇస్తుందని విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి పబిత్రా మార్గెరిటా అన్నారు. ఈ రోజు కౌలాలంపూర్‌లో జరిగిన ASEAN విదేశాంగ మంత్రుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. భారతదేశపు యాక్ట్ ఈస్ట్ పాలసీ, ఇండో-పసిఫిక్ ఆలోచనలకు ASEAN మూలస్తంభమని ఆయన పేర్కొన్నారు. ASEAN నేతృత్వంలోని దేశాల యంత్రాంగాలకు భారతదేశం ఇచ్చే ప్రాధాన్యత పలు రంగాల్లో సహకారాన్ని పెంచుతుందని పబిత్రా మార్గెరిటా తెలిపారు.

=====================

అండర్‌సన్ టెండూల్కర్ ట్రోఫీలో భాగంగా భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య మూడవ టెస్ట్ మ్యాచ్ లో ఇంగ్లాండ్ రెండవ ఇన్నింగ్స్‌లో టీ విరామ సమయానికి 6 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసింది.

=====================

మధ్యప్రదేశ్, గోవా, కేరళ, కర్ణాటక తీరప్రాంతం, జమ్మూ కాశ్మీర్ లడఖ్‌లలో రాబోయే 3 నుండి 4 రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ (IMD) అంచనా వేసింది. దేశ వ్యాప్తంగా నెలకొన్న వాతావరణ పరిస్తితులను IMD శాస్త్ర వేత్త వివరిస్తూ..

(వాయిస్ 27 సెకన్లు)

=====================

వింబుల్డన్ 2025 పురుషుల సింగిల్స్ విభాగంలో ప్రపంచ నంబర్ 1 ఇటలీకి చెందిన జానిక్ సిన్నర్, డిఫెండింగ్ ఛాంపియన్ కార్లోస్ అల్కరాజ్‌ల మధ్య ఫైనల్ మ్యాచ్ కొద్ది సేపటి క్రితం ప్రారంభమైంది. కాగా నిన్న జరిగిన మహిళల సింగిల్స్ విభాగం ఫైనల్ మ్యాచ్‌లో ఇగా స్వియాటెక్ విజేతగా నిలిచి వింబుల్డన్ గ్రాండ్ స్లామ్ టైటిల్‌ను అందుకున్నారు.

======================

======================